సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 10 । మార్చి । 2024



బీచ్ శుభ్రం.. మరింత భద్రం

విశాఖ తీరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు, పటిష్ట భద్రతకు జీవీఎంసీ వినూత్న చర్యలు చేపడుతోంది. IIలో



కటకటాల్లోకి మోసగాళ్లు

ఉద్యోగాలిప్పిస్తామని ఘరానా మోసానికి పాల్పడిన రమేష్‌కుమార్, అతని ప్రియురాలు సాయి ప్రవీణలను అరెస్ట్ చేశారు. IIలో



అంధకారంలో.. కాంతికిరణం

పుట్టుకతో వచ్చే మెదడు, వెన్నెముక లోపాలు నివారించడంలో ఏఎంసీ పరిశోధకుల అధ్యయనాలు పురోగతి సాధించాయి. IVలో

న్యూస్‌రీల్

సింహాద్రిలో విద్యుదుత్పత్తి పునరుద్ధరణ

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ నాల్గవ యూనిట్‌లో సాంకేతిక సమస్య కారణంగా గురువారం సాయంత్రం నిలిచిపోయిన విద్యుదుత్పత్తిని శనివారం ఉదయం పునరుద్ధరించారు. సంస్థలో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాల్గవ యూనిట్ బ్రాయిలర్‌లో అమర్చిన ట్యూబుకు లీకేజీ ఏర్పడిన కారణంగా గురువారం సాయంత్రం విద్యుదుత్పత్తిని అధికారులు నిలిపివేశారు. సమస్యను గుర్తించిన సాంకేతిక నిపుణులు యుద్ధప్రాతిపదికన రిపేర్లను పూర్తి చేసి శనివారం ఉదయం 8.30 గంటలకు విద్యుదుత్పత్తిని పునరుద్ధరించారు. ప్రస్తుతం సంస్థలో నాలుగు యూనిట్ల ద్వారా పూర్తి స్థాయిలో విద్యుదుత్పత్తి జరుగుతుందని ఎన్టీపీసీ అధికారవర్గాలు వెల్లడించాయి.

ఆర్జేడీగా విజయభాస్కర్ బాధ్యతల స్వీకరణ



ఆర్జేడీ విజయభాస్కర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆనందరెడ్డి

విశాఖ విద్య: విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్జేడీ)గా బి.విజయభాస్కర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడలోని సమగ్ర శిక్ష ఎస్పీడీ కార్యాలయంలో అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్‌గా(ఎస్‌ఏఎంవో)గా పని చేస్తున్న విజయభాస్కర్‌ను విశాఖ ఆర్జేడీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన ఆర్జేడీ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. కార్యాలయ సూపరింటెండెంట్ ఆనంద్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్టీయూ జిల్లా కార్యదర్శి ఇమంది పైడిరాజు ఆధ్వర్యంలో సంఘం జిల్లా నాయకులు ఆర్జేడీని కలిసి అభినందించారు.

అంతర్జాతీయ హిందీ సదస్సుకు ఇక్బాల్



ఏయూక్యాంపస్: ఏయూ హిందీ విభాగం పూర్వ ఆచార్యుడు, విశాఖ హిందీ పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎం.ఎస్ ఇక్బాల్‌కి కజకిస్తాన్‌లో జరిగే అంతర్జాతీయ హిందీ సమ్మేళనానికి భారత ప్రభుత్వం తరపున ఆహ్వానం అందింది. కజకిస్తాన్‌లోని ఫరాబి కజఖ్ జాతీయ విశ్వవిద్యాలయం, వివేకానంద సాంస్కృతిక కేంద్రం, భారత ఎంబసీ సంయుక్తంగా యూరేషియా, భారత్‌లో హిందీ వర్తమానం, భవిష్యత్తు అంశంపై సదస్సును నిర్వహిస్తోంది. మార్చి 13–14 తేదీల్లో హిందీ భాష, సాహిత్యాలపై అల్మటీ యూనివర్సిటీలో అంతర్జాతీయ సదస్సు ను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆచార్య ఇక్బాల్ హిందీ భాష వికాసంలో చారిత్రాత్మక సంఘటనలు అనే అంశంపై తమ ప్రసంగ పత్రాన్ని సమర్పిస్తారు.

యారాడ తీరంలో బాలుడిని రక్షించిన లైఫ్‌గార్డ్స్



లైఫ్ గార్డ్స్ రక్షించిన బాలుడు

పెదగంట్యాడ: యారాడ సముద్రంలో కొట్టుకుపోతున్న ఓ బాలుడిని జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ రక్షించారు. వివరాలివీ.. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలానికి చెందిన కుమార్ (12) తల్లిదండ్రులతో కలసి యారాడ తీరంలో శనివారం ఉదయం స్నానం చేస్తుండగా అలల తాకిడికి ఒక్కసారిగా కొట్టుకుపోయాడు. అక్కడే ఉన్న జీవీఎంసీ లైఫ్ గార్డ్స్ కె.లోవరాజు, సీహెచ్ శ్రీనివాస్, కె.వెంకట్ గమనించి, సముద్రంలోకి దూకి ఆ బాలుడిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఆపై ప్రాథమిక చికిత్స అందించి.. తల్లిదండ్రులకు అప్పగించారు.

భక్తజన సంద్రం

- శివరాత్రి స్నానాలకు పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన బీచ్‌లు



శంభో శంకర.. హరహర మహాదేవ



ఆర్.కె.బీచ్‌కు పోటెత్తిన భక్తజన సందోహం

బీచ్‌రోడ్డు/కొమ్మాది/తగరపువలస: విశాఖ సాగరతీరం జనసంద్రమైంది. శివనామస్మరణతో హోరెత్తింది. మహా శివరాత్రి సందర్భంగా శుక్రవారం శివాలయాల్లో పూజలు, అభిషేకాలు చేసిన భక్తులు రాత్రికి జాగరణ చేసి శనివారం సముద్ర స్నానం ఆచరించడంతో తీరంలోని బీచ్‌లన్నీ భక్తులతో నిండిపోయాయి. ఉదయం ఐదు గంటల నుంచి భక్తులు సముద్రంలో పుణ్య స్నానాలు చేయగా.. కొందరు భక్తులు పితృదేవతలకు తర్పణాలు అర్పించారు. స్నానానంతరం ప్రత్యక్ష దైవమైన సూర్యభగవానుడికి పూజలు చేశారు. పిల్లలు, వృద్ధులు, మహిళలు, యువకులు మహా శివరాత్రి ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. టీఎస్సార్ కళాపీఠం ఆధ్వర్యంలో జరిగిన మహా కుంభాభిషేకంలో వేలాది మంది భక్తులు భాగస్వాములయ్యారు. రాత్రంతా బీచ్‌లోనే జాగరణ చేశారు. ఆర్.కె. బీచ్, జోడుగుళ్ల పాలెం, అప్పికొండ బీచ్, రుషికొండ, సాగర్‌నగర్, భీమిలి, యారాడ, మంగమారిపేట, ఉప్పాడ తదితర బీచ్‌లు పుష్కరాలను తలపించాయి. భీమిలి బీచ్‌కు విశాఖ, విజయనగరం నుంచి భక్తులు తరలివచ్చి త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. పుణ్య స్నానాలు చేసిన వారు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా జీవీఎంసీ ఏర్పాట్లు చేసింది. వేల సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. తీరంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. లైఫ్‌గార్డులు ఎప్పటికప్పుడు భక్తులను హెచ్చరిస్తూ.. వారిని నియంత్రించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. పలువురు నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భక్తులకు ప్రసాదాలు, తాగునీరు అందించారు.



తన్మయత్వం





భీమిలీ తీరంలో..



ఉచిత సేవ



శివోహం




హెచ్చరిక



హరోంహర

టూరిజం.. ఆమెదే ఏకఛత్రాధిపత్యం

- ఏపీటీడీసీలో ఓ అధికారిణి వింత వైఖరి
- అధికారాలు లేకపోయినా 29 మంది సిబ్బందిని బదిలీ చేసిన వైనం
- ఉత్తరాంధ్ర రీజియన్ పరిధిలో పర్యాటక శాఖలో కలకలం
- ఏపీటీడీసీ టెండర్లలోనూ చేతివాటం
- ఉన్నతాధికారులకు తెలియకుండా సర్ఫింగ్‌కు అనుమతులు
- బదిలీలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సిబ్బంది!



సాక్షి, విశాఖపట్నం : రాణి తలచుకుంటే.. దెబ్బలకు కొదువా..? అదేంటి రాజు తలచుకుంటే కదా..? ఇక్కడ రాణే పవర్‌ఫుల్.. కానీ ట్విస్ట్ ఏంటంటే.? ఆ రాణికి పవర్స్ లేవు. కానీ.. ఆమెదే ఏకఛత్రాధిపత్యం. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ విశాఖ డివిజన్ పరిధిలో ఉప్పు పప్పు కొనే దగ్గర నుంచి.. సాగర జలాల్లో విహరించే వరకూ అంతా ఆమె కనుసన్నల్లోనే సాగుతోంది. ఆమె ఆగడాలు ఇంకాస్త శృతిమించి.. ఎలాంటి అధికారాలు లేకపోయినా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా ఏకంగా 29 మంది సిబ్బందిని డివిజన్ పరిధిలో బదిలీలు చేసేశారు. ఇలా ప్రతి విషయంలోనూ మేడం చేస్తున్న అతిపై పర్యాటక సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లా పరిధిలో ఏపీటీడీసీ డివిజన్ కార్యాలయం విశాఖపట్నంలో ఉంది. ఇక్కడ నుంచే డివిజన్ స్థాయి అధికారులు కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంటారు. ఈ విభాగంలోనే దిగువ స్థాయి నుంచి ఎదిగి డివిజన్ స్థాయి అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఓ మహిళ చేస్తున్న పెత్తనం పర్యాటక శాఖలో కలకలం రేపుతోంది. నేనే మోనార్క్ అనే రీతిలో సాగిస్తున్న కార్యకలాపాలు.. పర్యాటక శాఖ ఉన్నతాధికారులకు సైతం ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఆ మహిళా అధికారికి ఎలాంటి అధికారాలు లేకపోయినా ఇటీవల ఏకంగా 29 మంది ఉద్యోగులను వివిధ ప్రాంతాలకు బదిలీ చేసేశారు. తనకు నచ్చిన వారిని తన కోటరీగా ఏర్పాటు చేసుకునేలా ఈ బదిలీలు సాగించేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఏ మాత్రం సమాచారం లేకుండా.. తనకు అధికారాలు లేకపోయినా చేయడంపై ఏపీటీడీసీలో చర్చనీయాంశమైంది. తమని అకారణంగా.. అధికారాలు లేని ఓ అధికారి బదిలీ చేయడంపై పర్యాటక సిబ్బంది విజయవాడలోని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఆది నుంచీ అదే స్వభావం

ఏపీటీడీసీలో చేరినప్పటి నుంచి ఆ మహిళా అధికారి అదే దూకుడును ప్రదర్శిస్తున్నారు. డీవీఎంలు ఎందరు వచ్చినా.. ఆమెదే సామ్రాజ్యమంతా అన్నట్లుగా వ్యవహారం నడుస్తోంది. టూరిజం శాఖ ఆధ్వర్యంలో నడిచే హరిత హోటళ్లు, రెస్టారెంట్లకు అవసరమయ్యే నిత్యావసరాలు, సబ్బులు, ఇతర సామగ్రి ఏం కొనాలన్నా.. ఆమె కనుసైగ చేయనిదే ఫైల్ కదలదు. ఎవరికి టెండర్లు ఇవ్వాలి? ఎంతకు ఇండెంట్ ఇవ్వాలి.. టెండర్ కావాలంటే.. ఎంత పర్సంటేజీ ఫిక్స్ చేయాలి? ఇలా ప్రతి ఒక్కటీ ఆమె చేతుల్లోనే సాగుతోంది.

సర్ఫింగ్ జరుగుతున్నా..

రుషికొండ సమీపంలోని ఓ బీచ్‌ను నెల రోజుల కిందట పర్యాటక శాఖ ఉన్నతాధికారులు పరిశీలన చేయగా.. అక్కడ సర్ఫింగ్ యాక్టివిటీ నిర్వహిస్తుండటం గుర్తించారు. ఎవరు అనుమతులు ఇచ్చారని నిర్వాహకులను ప్రశ్నించగా.. ఆ మహిళా అధికారి తమకు పర్మిషన్ ఇచ్చారని సమాధానమివ్వడంతో అనుమానం కలిగింది. సర్ఫింగ్ యాక్టివిటీతో ఏపీటీడీసీకి ఎంత ఆదాయం వస్తుందో చూద్దామని భావించిన అధికారులు.. దానికి సంబంధించిన ఫైల్ కనిపించకపోవడంతో ఆమెను అడిగినట్లు సమాచారం. వాళ్లకు అనుమతి ఇవ్వలేదని చెప్పడంతో కంగుతిన్న అధికారులు.. సర్ఫింగ్ నిర్వాహకులతో పాటు ఆమెనూ విచారించారు. ఆమె అనుమతితోనే నిర్వహిస్తున్నట్లు ఈ విచారణలో తేలినట్లు సమాచారం. అయినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు లేవు. ఇలా ప్రతి విషయంలోనూ తానే అంతా అన్నట్లుగా వ్యవహరిస్తూ.. ఏపీటీడీసీపై పెత్తనం చెలాయిస్తున్న మహిళా అధికారి అక్రమాలపై విజయవాడలో వరస ఫిర్యాదులు అందుతున్నాయి.

జూడో క్రీడాకారిణికి దాతల సాయం



క్రీడాకారిణి కీర్తికి ఆర్థిక సాయం అందిస్తున్న భీమిలి సన్ స్కూల్ ప్రతినిధులు

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్టకు చెందిన జూడో క్రీడాకారిణి పాలెపు కీర్తికి పలువురు దాతలు శనివారం ఆర్థికసాయం అందించి ప్రోత్సహించారు. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు న్యూఢిల్లీలో కె.డి జాదవ్ ఇండోర్ స్టేడియంలోని ఐజీ కాంప్లెక్స్‌లో జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగనున్న జాతీయస్థాయి జూడో పోటీలకు కీర్తి హాజరవుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ పోటీల్లో పాల్గొనేందుకు గానూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఆమె గురించి 'జూడోలో కీర్తి పతాక'శీర్షికతో 'సాక్షి' కథనం ప్రచురించింది. ఈ కథనానికి స్పందించిన భీమిలి సన్ స్కూల్ చైర్మన్ కైతపల్లి శ్రీనివాస్ రూ.10 వేలు సాయం చేశారు. ఈ మొత్తాన్ని వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు అరుణ్‌కుమార్ చేతుల మీదుగా కీర్తికి అందించారు. సంతపేట అంకిత ఫ్యాషన్స్ యజమాని పేర్ల రాజేష్ రూ.1000, చిట్టివలస ఇండియన్ పేట్రియాట్స్ గ్రూప్ తరపున రూ.7వేలు, పెద్దిపాలేనికి చెందిన మరో దాత రూ.5 వేలు అందించారు. దీంతో ఆమె ఆదివారం న్యూఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నారు.

13న 'పీఎం సురాజ్'

- లబ్ధిదారులతో ప్రధాని ముఖాముఖి
- కలెక్టర్ డా.మల్లికార్జున వెల్లడి

మహారాణిపేట: కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరు, సంబంధిత పథకాలు పొందుతున్న లబ్ధిదారులతో ఈ నెల 13న పీఎం సురాజ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు వర్చువల్‌గా జరిగే కార్యక్రమంలో లబ్ధిదారులతో, రుణ గ్రహీతలతో ప్రధాని మోదీ ముఖాముఖి ఉంటుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 510 జిల్లాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని, విశాఖ జిల్లాకు సంబంధించి కలెక్టరేట్ వీసీ హాల్లో కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. జిల్లాలోని సంబంధిత లబ్ధిదారుల వివరాలను సేకరించి నివేదించాలని సూచించారు. సఫాయీ కర్మచారీలకు పీపీఈ కిట్లు, లబ్ధిదారులకు ఆయుష్మాన్ కార్డులు అందజేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. తాజాగా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి త్వరితగతిన రుణాలను మంజూరు చేసేలా బ్యాంకర్లు సహకరించాలని, వివరాలను నివేదించాలని సూచించారు. కార్యక్రమం సజావు నిర్వహణ, ఏర్పాట్ల పర్యవేక్షణ నిమిత్తం నోడల్ అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు కార్యక్రమంలో భాగస్వాములవుతారని కలెక్టర్ పేర్కొన్నారు.

బీచ్ శుభ్రం.. మరింత భద్రం

- సాగరతీరంలో పరిశుభ్రత, భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం
- తీరప్రాంతాల శుభ్రతకు బీచ్‌టెక్ 2000 ఎస్ యంత్రాల వినియోగం
- సందర్శకుల ప్రాణాలు కాపాడేందుకు అందుబాటులో 38 మంది లైఫ్‌గార్డ్స్

డాబాగార్డెన్స్: విశాఖపట్నం.. దేశంలోనే ప్రధాన పర్యాటక ఆకర్షణ గల నగరం. విశాఖ పేరు చెప్పగానే ముందుగా గుర్తొచ్చేది బీచ్. ఎటూ చూసిన నీలివర్ణంలో కనిపించే సముద్ర అందాలు చూపరులను ఎంతగానో ఆకర్షిస్తాయి. సముద్రం తీరం నగరానికి ఆనుకుని ఉండటంతో సాయంత్రం కాగానే జనం అలా బీచ్ వైపు అడుగేస్తారు. వేడి వేడి రుచులను ఆరగిస్తూ.. చల్లని గాలిని ఆస్వాదిస్తారు. విదేశీ పర్యాటకులు సైతం విశాఖలోని బీచ్‌లకు మంత్రముగ్ధులవుతున్నారు. ఇటీవల ఆర్.కె.బీచ్‌ను సందర్శించిన ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ స్టీవ్ హార్మిసన్.. ఇక్కడి అందాలకు ఫిదా అయ్యారు. భారత్‌లో తాను చూసిన బీచ్‌ల్లో ఆర్.కె.బీచ్ అత్యంత శుభ్రమైనదని కితాబిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సాగరతీర పరిశుభ్రతపై చేపట్టిన చర్యలతో ఇది సాధ్యమైంది. మునుపెన్నడూ లేని విధంగా తీర ప్రాంతాలు సుందరంగా రూపుదిద్దుకున్నాయి. తీరంలో భద్రతకు సైతం ప్రాధాన్యమిచ్చి.. 38 మంది లైఫ్‌గార్డ్స్‌ను నియమించింది. ఏడాది కాలంలో వీరు దాదాపు 115 మందిని ప్రాణాలతో రక్షించారు.


బీచ్‌ను శుభ్రం చేస్తున్న బీచ్‌టెక్ 2000 ఎస్

6 ప్రత్యేక వాహనాలతో క్లీనింగ్

'ఎకో వైజాగ్'లో భాగంగా బీచ్ టెక్ 2000 ఎస్ యంత్రాలను జీవీఎంసీ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఐదు వాహనాలను మూడేళ్ల పాటు రూ.9.98 కోట్లకు లీజు తీసుకుంది. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.82 లక్షలతో మరో వాహనాన్ని సొంతంగా సమకూర్చుకుంది. బీచ్ క్లీనింగ్ పేరిట ఈ ఆరు వాహనాలు రుషికొండ, ఆర్.కె.బీచ్, భీమిలి తదితర బీచ్‌ల్లో నిత్యం తిరుగుతూ వ్యర్థాలను తొలగిస్తూ.. బీచ్‌లను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నాయి.

115 మందిని కాపాడిన లైఫ్‌గార్డ్స్

సముద్రంలో మునిగిపోతున్న వారిని రక్షించడానికి జీవీఎంసీ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. వివిధ రాష్ట్రాల నుంచి విశాఖ బీచ్ అందాలు చూసేందుకు వచ్చే పర్యాటకులు.. సరదాగా బీచ్‌లో స్నానానికి దిగి గల్లంతైన సంఘటనలు కోకొల్లాలు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ పటిష్ట చర్యలు చేపట్టింది. సురక్షితమైన బీచ్‌గా తీర్చిదిద్దేందుకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ కంకణం కట్టుకున్నారు. ఇందులో భాగంగానే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వాటర్ స్పోర్ట్స్ సహకారంతో 38 మంది సముద్రపు ఈతగాళ్లను ఎంపిక చేశారు. భీమిలి బీచ్‌లో నలుగురు, రుషికొండ బీచ్‌లో ఆరుగురు, సాగర్‌నగర్ బీచ్‌లో నలుగురు, జోడుగుళ్లపాలెం బీచ్‌లో నలుగురు, లుంబినీపార్క్ బీచ్‌లో నలుగురు, పెదజాలరిపేట డిపో ఏరియాలో నలుగురు, ఆర్కే బీచ్ వద్ద ఎనిమిది మంది, కోస్టల్ బ్యాటరీ ఏరియాలో నలుగురు షిఫ్ట్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్నారు. ఏడాది కాలంలో సముద్రంలో.. ప్రమాదవశాత్తూ మునిగిపోతున్న వారు, ఆత్మహత్యకు ప్రయత్నించిన దాదాపు 115 మందిని ప్రాణాలతో రక్షించి తీరానికి తీసుకొచ్చారు. కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.


పరిశుభ్రంగా పాండురంగాపురం బీచ్(ఫైల్)

తీరంలో భద్రతకు రోబో

సముద్రంలో మునిగిపోతున్న వారిని రక్షించడానికి వైజాగ్ సేవ్ సంస్థ రూపొందించిన లైఫ్‌బోయ్ రోబోను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ రోబో పూర్తిగా బోటు తరహాలో పని చేస్తూ ఒకే కాలంలో ముగ్గురిని కాపాడగలదు. సెకనుకు 7 మీటర్ల వేగంతో 600 మీటర్ల వరకు పని చేస్తుంది.


బీచ్‌లో గల్లంతైన వారిని వెతుకుతున్న రోబో(ఫైల్)


రోబో పనితీరుపై అవగాహన కల్పిస్తున్న శిక్షకుడు


యంత్రాన్ని పరిశీలిస్తున్న మేయర్(ఫైల్)

విశాఖకు ఎంతో ప్రాముఖ్యం



దేశంలోనే విశాఖ ఎంతో ప్రాముఖ్యం ఉంది. వివిధ ప్రాంతాల నుంచి విశాఖ విచ్చేసే పర్యాటకులు ముందుగా చూసేది బీచ్‌నే. బీచ్ అందాలకు ముగ్ధులై.. సరదా కోసం స్నానాలకు దిగి ప్రమాదవశాత్తూ కెరటాలకు గల్లంతవుతున్నారు. ఈ నేపథ్యంలో తీరంలో పటిష్ట భద్రత చర్యలు చేపట్టాం. లైఫ్‌గార్డ్స్ నియమించడంతో పాటు రోబోలను అందుబాటులోకి తీసుకొచ్చాం. తీర శుభ్రతకు బీచ్‌టెక్ 2000 ఎస్ యంత్రాలను వినియోగిస్తున్నాం.

– గొలగాని హరి వెంకటకుమారి, మేయర్

ప్రమాదాలు జరగకుండా చర్యలు



అధిక సంఖ్యలో సందర్శకులు విశాఖలోని బీచ్‌లకు వస్తుంటారు. ఈ నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా ప్రజల ప్రాణాలు కాపాడేందుకు ప్రత్యేక రోబోటిక్ యంత్రాలు అందుబాటులోకి తీసుకొచ్చాం. సముద్రంలో స్నానాలు చేసే సందర్శకులను జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ నిరంతరం గమనిస్తుంటారు. ఒంటరిగా బీచ్‌లోకి వెళ్తున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంటుంది.

– సాయికాంత్ వర్మ, కమిషనర్, జీవీఎంసీ

కటకటాల్లోకి ఘరానా మోసగాళ్లు


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సత్తిబాబు, ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సీఐ రామకృష్ణ


స్వాధీనం చేసుకున్న కారు, ద్విచక్రవాహనాలు

- ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.లక్షల్లో వసూలు
- అరెస్టు చేసిన పెందుర్తి పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీసీపీ సత్తిబాబు

గోపాలపట్నం: ఉద్యోగాలిప్పిస్తామని ఘరానా మోసానికి పాల్పడిన హనుమంతు రమేష్‌కుమార్, అతని ప్రియురాలు లుకలాపు సాయి ప్రవీణలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరు నేరాలకు పాల్పడిన విధానాన్ని డీసీపీ-2 సత్తిబాబు వెస్ట్ ఏసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరించారు. హనుమంతు రమేష్‌కుమార్ 2008 నుంచి 2022 వరకు సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేశాడు. జమ్ముకశ్మీర్‌కు బదిలీ కాగా అక్కడ ఉద్యోగం చేయలేక మానేశాడు. అతడికి 2012లో సరితతో వివాహమైంది. వీరికి పాప, బాబు ఉన్నారు. ఉద్యోగం మానేసిన తర్వాత సులభంగా డబ్బులు సంపాదనకు అలవాటు పడిన రమేష్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించడం మొదలు పెట్టాడు. పెందుర్తి పులగానిపాలెం ఎస్ఆర్ లేఅవుట్‌లో ఇంటిని కొనుగోలు చేశాడు. ఈ ప్రాంతంలో పరిచయాలు ఏర్పరుచుకున్నాడు. ఈ క్రమంలో 2018లో శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన లుకలాపు సాయి ప్రవీణతో పరిచయం ఏర్పడింది. వీరిద్దరు విశాలాక్షినగర్‌లో అద్దె ఇంట్లో సహజీవనం చేస్తున్నారు. ఎస్ఆర్ లేఅవుట్ ప్రాంతంలో రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తున్నానని నమ్మించాడు. కాలనీలో పండగలకు విరాళాలు, విగ్రహాలు ఇస్తూ దగ్గరయ్యాడు. ఇంటి సమీపంలోని దుంపల కృష్ణారావుది రమేష్‌ది ఒకే సామాజిక వర్గం కావడంతో బావ అని సంబోధిస్తూ దగ్గరయ్యాడు. తన భార్య సరిత మేనమామ డీఆర్ఎంగా పనిచేస్తున్నాడని ఆయన రిటైర్ అయ్యే సమయం దగ్గర పడుతోందని, తన వారికి కొంత మందికి రైల్వేలో ఉద్యోగాలు ఇప్పించే అవకాశం వచ్చిందని రమేష్ నమ్మబలికాడు. కృష్ణారావు ఇదంతా నమ్మి తనకు తెలిసిన స్నేహితుల పిల్లలు 12 మంది నుంచి సుమారు రూ.85 లక్షలు కట్టించాడు. రమేష్ ప్రియురాలు సాయి ప్రవీణను డీఆర్ఎం పీఏగా పరిచయం చేశాడు.

ఫేక్ ఈ-మెయిల్స్, అపాయింట్‌మెంట్లు

సాయి ప్రవీణతో కలిసి విజయవాడలో ఐశ్వర్య లాడ్జిలో రైల్వే ఉద్యోగాల కోసం 2023 మార్చిలో పరీక్షలు రాయించాడు. బాధితులకు ఫేక్ ఈ-మెయిల్స్ పంపించాడు. ఫేక్ అపాయింట్‌మెంట్లు కూడా ఇచ్చాడు. ముందు కొన్నాళ్లు ట్రెనింగ్ ఉంటుందని నమ్మబలికాడు. ఉద్యోగాల్లో చేర్పించేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లాడు. రైల్వేస్టేషన్‌కు ఎదురుగా ఉన్న సంతోష్ లాడ్జిలో ఉంచాడు. అపాయింట్‌మెంట్ లెటర్లు పట్టుకుని డీఆర్ఎం ఆఫీసుకు వెళ్లి తిరిగి వచ్చిన రమేష్ ట్రెనింగ్ సెంటర్లు ఖాళీలేవు కొన్నాళ్లు టైమ్ పడుతుందని చెప్పి 10 రోజులపాటు అక్కడే ఉంచేశాడు. బాధితులు తరచూ అడుగుతుండడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీంతో బాధితులు రమేష్ సొంతూరైన శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి సమీప శేఖరపురం వెళ్లి అతడి తల్లిదండ్రులను నిలదీశారు. ఈ విషయం తెలుసుకున్న రమేష్ ఇద్దరు బాధితుల ఇంటికి వెళ్లి డమ్మీ తుపాకీతో బెదిరించి వారి వద్ద నుంచి బలవంతంగా రూ.10 వేలు తీసుకున్నాడు.

దోచుకున్న సొమ్ముతో జల్సాలు

అలాగే ఉద్యోగాలిప్పిస్తామని పెందుర్తి, విజయనగరం, భోగాపురం, ప్రాంతాలకు చెందిన పలువురి నుంచి లక్షలాది రూపాయలు దోచుకున్నట్లు సమాచారం. ఇలా దోచుకున్న సొమ్ముతో నెలవారి ఈఎంఐలు, పర్సనల్ లోన్లు, సొంత ఇంటి ఖర్చులతో పాటు అడవివరంలో ఉన్న వదిన కుటుంబ ఖర్చులు, ఏ-2తో కలిసి జల్సాలు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులను శనివారం పెందుర్తిలో అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కారు, రెండు ద్విచక్రవాహనాలు, పోలీస్ యూనిఫారం, నకిలీ పిస్టల్, ల్యాప్‌టాప్, మూడు సెల్‌ఫోన్లు, ఫేక్ అపాయింట్‌మెంట్ లేఖలు, రబ్బర్ స్టాంప్ స్వాధీనం చేసుకున్నారు. వీరిపై 419, 420, 307, 386, ఆర్/డబ్ల్యూ 34 ఐపీసీ సెక్షన్లతో పాటు 25 ఏఆర్ఎంఎస్ యాక్ట్ సెక్షన్ 66-సి, 66-డి ఐటీ యాక్ట్ కేసు నమోదు చేశారు. వెస్ట్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, పెందుర్తి సీఐ ఎల్.రామకృష్ణ పాల్గొన్నారు.

ఏఎంసీకి లాజరస్ భౌతికకాయం



వైద్యులకు లాజరస్ భౌతికకాయాన్ని అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్) లాజరస్ (ఫైల్)

మహారాణిపేట: భారత నాస్తిక సమాజం సీనియర్ నాయకుడు సీహెచ్.ఎఫ్.లాజరస్ (70) శనివారం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. లాజరస్ విశాఖలో భారత నాస్తిక సమాజం మొదటి శిక్షణ తరగతులు నిర్వహించారు. మూఢనమ్మకాల నిర్మూలనపై రెండు పుస్తకాలను రచించారు. లాజరస్ షిప్‌యార్డ్‌లో పనిచేసి పదవీ విరమణ అనంతరం వామపక్షాలతో కలిసి కార్మిక సమస్యలపై ఉద్యమాలు చేశారు. లాజరస్ మృతదేహాన్ని ఆంధ్ర మెడికల్ కాలేజ్ అనాటమీ డిపార్టుమెంటుకు విద్యార్థుల పరిశోధన నిమిత్తం సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్- చారిటబుల్ ట్రస్ట్ శరీర అవయవదాతల సంఘం ఆధ్వర్యంలో అప్పగించారు. భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీరామమూర్తి, జిల్లా అధ్యక్షుడు వై.నూకరాజు, ఎస్‌పీఈసీటీ ట్రస్టీ ఎ.బాలభాను, విజ్ఞానందు, రామప్రభ షిప్ యార్డు ఉద్యోగులు, బంధువులు, మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్‌పీసీఎల్‌కు భారీ యంత్రాలు తరలింపు


ఐవోసీ మార్గం నుంచి భారీ యంత్రాలను తరలిస్తున్న సిబ్బంది

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ విస్తరణలో భాగంగా రెండు భారీ యంత్ర పరికరాలను శుక్రవారం అర్ధరాత్రి సింధియా మార్గం నుంచి హెచ్‌పీసీఎల్ ఐవోసీ మార్గం వైపు తరలించారు. సంస్థలో సుమారు రూ.26 వేల కోట్లతో రెండేళ్లుగా విస్తరణ పనులు జరుగుతున్న సంగతి తెలిసిందే. దీనికి అవసరమైన యంత్రాలు, క్రూడ్ కోలమ్స్, భారీ రియాక్టర్లను ముంబయి, గుజరాత్ తదితర ప్రాంతాల నుంచి సముద్రమార్గం ద్వారా తీసుకొస్తున్నారు. కొన్ని యంత్రాలను షిప్‌యార్డ్ పక్కన గల స్థలంలో రూపొందిస్తున్నారు. ఇక్కడ తయారైన యంత్రాలను రిమోట్ కంట్రోల్‌తో నడిచే 120 టైర్ల గల వాహనాల ద్వారా శుక్రవారం అర్ధరాత్రి సింధియా మార్గం, నౌసేనాభాగ్ మీదుగా ఐవోసీ మార్గం వైపు తరలించారు. నిబంధనల ప్రకారం ఇలాంటి భారీ వాహనాలను ప్రధాన సేవా మార్గంలో తరలించేటప్పుడు విద్యుత్, అగ్నిమాపక, ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ ఉండాలి. అయితే వీటిని తరలించేటప్పుడు ట్రాఫిక్ పోలీసులు మాత్రమే నామమాత్రంగా కనిపించారు.

ఆకట్టుకుంటున్న సూత్ర ఎగ్జిబిషన్


వస్త్రాలను తిలకిస్తున్న యువతులు

బీచ్‌రోడ్డు: బీచ్‌రోడ్డులోని నోవాటెల్‌లో ఏర్పాటు చేసిన సూత్ర ఎగ్జిబిషన్ నగరవాసులను ఆకట్టుకుంటోంది. ఈ ఎగ్జిబిషన్‌లో దుస్తులు, గౌన్లు, చీరలు, పాదరక్షకాలు, ఉపకరణాలు, మరెన్నో విభిన్న డిజైనరీ ఉత్పత్తులను అందుబాటులో ఉంచారు. శనివారం అధిక సంఖ్యలో సందర్శకులు తరలివచ్చి.. ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ ప్రదర్శన ఆదివారం రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు 'పర్మినెంట్' ఉత్తర్వుల అందజేత

మహారాణిపేట: వైద్య ఆరోగ్య శాఖలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తిస్తూ.. వారికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు శనివారం ఉత్తర్వులు అందజేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో రెగ్యులర్ అయిన కాంట్రాక్టు ఉద్యోగుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఐదు బృందాలు పాల్గొని వీటిని తనిఖీ చేశాయి. అనంతరం ఉద్యోగులకు ఉత్తర్వులు అందజేశారు. మొత్తం 327 మంది ఉద్యోగుల్లో తొలి విడతలో 98 మంది సర్వీస్.. పర్మినెంట్ అయింది. వీరిలో 72 ఎంపీహెచ్ఏ (మేల్)లు, ఆరుగురు ల్యాబ్ టెక్నీషియన్లు, ఏడుగురు ఫార్మసిస్టులు(గ్రేడ్–2), 13 మంది ఎంపీహెచ్ఏ(ఫీమేల్) ఉద్యోగులు ఉన్నారని డీఎంహెచ్‌వో వివరించారు.


ఉత్తర్వులు అందజేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

5 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : అక్రమంగా తరలిస్తున్న ఐదు కిలోల గంజాయిని విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గవర్నమెంట్ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... జీఆర్పీ ఎస్ఐ వి.బాలాజీరావు సిబ్బందితో కలిసి విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఒడిశా రాష్ట్రం, గంజాం జిల్లాకు చెందిన రమేష్ మహానంద బ్యాగు తనిఖీ చేయగా అక్రమంగా తరలిస్తున్న ఐదు కేజీల గంజాయి గుర్తించారు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు. గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విశాఖ మీదుగా తెలంగాణకు గంజాయి తరలిస్తున్నట్లు రమేష్ అంగీకరించాడని జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు రజని, కీర్తి

గోపాలపట్నం: జాతీయ జూడో చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన మరగడ రజని, పాలెపు కీర్తిలను ఉమ్మడి విశాఖ జిల్లా జూడో క్రీడా సంఘం అధ్యక్షుడు చీఫ్ కోచ్ పాండ్రంకి రుక్మాకరరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి 14 వరకు న్యూఢిల్లీ కేడీ జాదవ్ ఇండోర్ స్టేడియంలో జరిగే జాతీయ స్థాయి జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో వీరిద్దరూ పాల్గొంటారని తెలిపారు. రజని 75 కిలోల విభాగంలో, కీర్తి 65 కిలోల విభాగంలో పోటీ పడతారని పేర్కొన్నారు. రజని అవంతీ కళాశాలలో బీఎస్సీ మొదటి ఏడాది చదువుతోంది. కీర్తి ఎస్‌వీఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ రెండో ఏడాది సంవత్సరం చదువుతోంది. ఈ పోటీల్లో అర్హత సాధిస్తే హాంకాగ్‌లో నిర్వహించే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశముందని తెలిపారు.


జూడో క్రీడాకారులతో చీఫ్ కోచ్ రుక్మాకరరావు

దివ్యాంగులకు అండగా ఉంటాం



సమావేశంలో పాల్గొన్న దివ్యాంగులు, పోలీసులు

- సీపీ రవిశంకర్
- దిశా దివ్యాంగ సురక్షపై అవగాహన

అల్లిపురం: దిశా దివ్యాంగ సురక్ష హెల్ప్‌లైన్ వినియోగంపై నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ శనివారం అవగాహన కల్పించారు. సూర్యాబాగ్ పోలీస్ కమిషనరేట్ ఆవరణలోని పోలీస్ మీటింగ్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో దిశా దివ్యాంగ సురక్ష హెల్ప్‌లైన్ వినియోగంపై జిల్లా అసోసియేషన్ ఆఫ్ ద డెఫ్ సభ్యులతో కలసి సమావేశం నిర్వహించారు. సుమారు 300 మంది దివ్యాంగులు పాల్గొన్నారు. ఆపదలో ఉన్నప్పుడు దిశా దివ్యాంగ సురక్ష టోల్ ఫ్రీ నంబర్ 7337324466 ద్వారా వీడియో కాల్, వాయిస్ కాల్, మెసేజ్, వాయిస్ మెసేజ్ ద్వారా పోలీసులను సంప్రదిస్తే తక్షణమే లోకల్ పోలీస్ వారిని అప్రమత్తంగా చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా బాధితులకు రక్షణ కల్పిస్తామన్నారు. టోల్ ఫ్రీ నంబర్‌కు రాజస్థాన్, ఒడిశా, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ వంటివి సుమారు 12 రాష్ట్రాల నుంచి 65 పైగా కాల్స్ వచ్చాయన్నారు. అందులో ఇతర రాష్ట్రాల ప్రాంతాల కాల్స్‌ను ఆయా ప్రాంతాల కంట్రోల్ రూంలకు తెలిపామన్నారు. నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ మాట్లాడుతూ దివ్యాంగులకు పోలీసులు అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగ సంఘాల ప్రతినిధులు సీపీకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి నెల 2, 15 తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య అంధులకు 7337324466, దివ్యాంగులకు 7337434422 నంబర్లలో సైన్ లాంగ్వేజస్ తెలిసిన నిపుణులను అందుబాటులో ఉంచి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని సీపీ రవిశంకర్ తెలిపారు.



దివ్యాంగురాలితో మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

అంధకారంలో..కాంతికిరణం

- ఫోలిక్ యాసిడ్ వ్యాధుల అధ్యయనంపై పురోగతి
- దేశంలోనే మొదటిసారిగా ఏఎంసీ అధ్యయనం

మహారాణిపేట : పుట్టుకతో వచ్చే మెదడు, వెన్నెముక లోపాలు నివారించడంలో ఆంధ్రా మెడికల్ కాలేజీలోని న్యూరోసర్జరీ విభాగానికి చెందిన పరిశోధకుల బృందం ప్రఖ్యాతిగాంచిన జాతీయ, అంతర్జాతీయ వైద్యులతో కలిసి చేసిన అధ్యయనాలు పురోగతి సాధించాయి. ఇలాంటి అధ్యయనాలు భారత దేశంలోనే మొట్టమొదటిసారిగా జరిగాయి. ఈ అంశం అంతర్జాతీయ జర్నల్ ఆఫ్ అమెరికన్ మెడికల్ అసోసియేషన్ నెట్‌వర్క్ ఓపెన్‌లో ప్రచురితం అయింది.

వెన్నుపూస సమస్యలపై అధ్యయనం

ఫోలిక్ యాసిడ్ లోపం వల్ల కలిగే వ్యాధులపై అధ్యయనానికి ఈ బృందం 2022లో శ్రీకారం చుట్టింది. ఈ లోపం వల్ల వెన్నుపూసలో నీరు చేరడం, మల ద్వారం చిట్లిపోవడం, కాళ్లు చచ్చుబడటం, మలం, మూత్రం అదుపు తప్పడం, తలలోంచి నీరు రావడం వంటివి సంభవిస్తాయని కేజీహెచ్ వైద్యులు గుర్తించారు. ఇలాంటి కేసులు కేజీహెచ్‌కు ప్రతినెల పలు ప్రాంతాల నుంచి 2 నుంచి 4 వరకు వస్తున్నాయని న్యూరోసర్జరీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ బి.హయగ్రీవరావు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలంలోని నెల్లిపూడి, బొర్రంపేట, తుమ్మలబంద, అంకంపాలెం గ్రామాల్లో 2022 జూలై నుంచి నవంబర్ వరకు అధ్యయనం చేశారు. ఈ గ్రామాల్లోని 1,200 కుటుంబాల్లో గల పురుషులు, స్త్రీలపై సర్వే, అధ్యయనం, పరిశోధనలు జరిగాయి. ఈ గ్రామాల్లో 18 నుంచి 45 సంవత్సరాలలోపు వయసు గల వారి నుంచి రక్తనమూనాలు సేకరించారు. అనంతరం ఒక్కొక్క కుటుంబానికి రెండు కిలోలు చొప్పున ఉప్పు ఉచితంగా పంపిణీ చేశారు. ఫోర్టిఫైడ్ ఉప్పు తిన్న తర్వాత మళ్లీ సర్వే, పరిశోధనలు, అధ్యయనం చేశారు. అయోడైజ్డ్ ఉప్పులో ఫోలిక్ యాసిడ్, అయోడిన్ రెండూ ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి కేసులు రావడంతో ఇక్కడ కూడా చేయాలని కేజీహెచ్, ఆంధ్రా మెడికల్ కాలేజీలోని పలు విభాగాలు దీనిపై దృష్టి సారించాయి. ఆచార్య గంగాధరం రీసెర్చ్ అండ్ అకడమిక్ సెల్ ఆధ్వర్యంలో పరిశోధన, ,అధ్యయనం జరుగుతోంది. విదేశాల్లో స్థిరపడ్డ పీడియాట్రిక్ న్యూరోసర్జన్ డాక్టర్ జోగి వి.పట్టిసాపు అవసరమైన ఖర్చులను సమకూర్చుతున్నారు. వెన్నుపూస సమస్యకు దారి తీసే స్పీనా బిఫిడా ఉన్నట్లు సర్వేలో తేలింది. దీనిపై అవగాహన పెంపొందించడానికి, నివారణకు నాలుగు గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించారు. యూఎస్‌ఏలోని ఫ్లోరిడాకు చెందిన డాక్టర్ జోగి పట్టిసాపు, ఏఎంసీలోని న్యూరో సర్జరీ విభాగానికి చెందిన పరిశోధకుల బృందం, జాతీయ, అంతర్జాతీయ వైద్యులు పరిశోధనలు, అధ్యయనాలు చేశారు.



గిరిజన మహిళలకు ఉప్పు సరఫరా చేస్తున్న న్యూరోసర్జన్ విజయశేఖర్



అయోడిన్ నిండిన ఉప్పుతో గిరిజన మహిళలు

ఫోలిక్ యాసిడ్‌తో జీవ చైతన్యం

ఫోలిక్ యాసిడ్ టేబుల్ సాల్ట్ చేర్చడం వల్ల మెదడు, వెన్నెపూస అభివృద్ధిని ప్రభావితం చేసి పుట్టుకతో వచ్చే న్యూరల్ ట్యూబ్ డిఫెక్ట్ వంటి అవరోధాలను సమర్థవంతంగా నివారిస్తుందని అధ్యయనం నిరూపించింది. ఫోలిక్ యాసిడ్ లోపం వల్ల శిశువుల్లో నాడీ సంబంధ సమస్యలు ఉత్పన్నం కావడమే కాకుండా ఒక్కోసారి మరణానికి కూడా దారి తీస్తుంది. మహిళలు గర్భధారణకు ముందు, తొలి దశలో ఫోలిక్ యాసిడ్‌ను తగినంతగా తీసుకోవడం ద్వారా చాలా వరకు ఈ సమస్యను నివారించవచ్చు. ఫోలిక్ యాసిడ్, అయోడిన్ మానవ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఫోర్టిఫైడ్ ఉప్పు తీసుకున్న వారిలో రక్త స్థాయి గణనీయంగా పెరిగిందని అధ్యయనం గుర్తించింది. దేశ విదేశాల నుంచి వచ్చిన నిపుణుల బృందం డాక్టర్ ఎం.వి.విజయశేఖర్, డాక్టర్ బి.హయగ్రీవరావు, డాక్టర్ ఫణిమాధవి, డాక్టర్ అనిల్‌కుమార్, యూఎస్‌ఏలోని కాలేజీ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన డాక్టర్ జోగి వి.పట్టిసాపు, ఎమోరీ విశ్వవిద్యాలయం వైద్యుడు గాడ్ పి.ఓకే, డాక్టర్ విజయ కంచెర్ల వంటి వారు ఈ సర్వేలో పాల్గొన్నారు.

మేలు చేస్తుంది..



థైరాయిడ్ సమస్య నివారించడానికి అయోడిన్ కలిపిన ఉప్పును ప్రభుత్వం తప్పనిసరి చేయాలి. ఉప్పు తయారీ కంపెనీలకు ఆ దిశగా ఆదేశాలు జారీ చేయాలి. ఇది మిలియన్ల మందికి మేలు చేస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా దీనిని సిఫార్సు చేసింది. ఫోలిక్ యాసిడ్ ఉప్పులో కలిపి తీసుకోవడం ద్వారా మంచి ఫలితాలుంటాయని పరిశోధన ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.

– డాక్టర్ ఎంవీ విజయశేఖర్, న్యూరో సర్జన్, విశాఖ

ఘోర ప్రమాదం.. మహా విషాదం

- దుమ్మబుడ్డి ప్రమాదంలో ఐదుకు చేరిన మృతుల సంఖ్య
- మృతుల్లో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందినవారు
- కుటుంబ సభ్యుల రోదనలతో నిండిన ఏరియా ఆస్పత్రి



కుమారుడు హరి మృతితో రోదిస్తున్న తల్లి

సాక్షి, పాడేరు/అరకులోయ టౌన్/అరకులోయ రూరల్: మన్యంలో విషాదం నిండుకుంది. అందరి మనసుల్లో శుక్రవారం రాత్రి జరిగిన ఘోర ప్రమాదమే సుడులు తిరిగింది. శివరాత్రి జాతరకు వెళుతుండగా బైక్‌లు ఢీకొని బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన కొంతిరి మోహన్‌ను కేజీహెచ్‌కు తరలిస్తుండగా శుక్రవారం అర్ధరాత్రి ఎస్.కోట ఘాట్‌లో మృతి చెందాడు. దీంతో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. అరకులోయ నుంచి లోతేరు పోయే రోడ్డులో దుమ్మబుడ్డి గ్రామ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. శివరాత్రి జాతర చూసేందుకు వేర్వేరు ప్రాంతాల నుంచి వెళుతున్న మూడు బైక్‌లు అతి వేగంగా వెళ్లడమే ప్రమాదానికి కారణమని ఎస్ఐ సంతోష్ తెలిపారు. అరకులోయ మండలం చినలబుడు గ్రామానికి చెందిన గొల్లూరి హరి (18), అమలకాంత్ (9) రాత్రి 10 గంటల సమయంలో పల్సర్ బైక్‌పై నందివలసలోని శివరాత్రి జాతరకు బయలుదేరారు. అలాగే లోతేరు పంచాయతీ గానుగవలస గ్రామం నుంచి గుబాయి త్రినాథ్ (32), గుబాయి సింహాద్రి(29), గుబాయి భార్గవ్(7), పెదవలస గ్రామానికి చెందిన కొంతిరి మోహన్(30) మరో బైక్‌పై ఎం.హట్టగుడ గ్రామంలోని శివరాత్రి జాతరకు బయలుదేరారు. లోతేరు రోడ్డులో ఈ రెండు బైక్‌లు వేగంగా వచ్చి బలంగా ఢీకొట్టడంతో బైక్‌లపై ప్రయాణిస్తున్న గిరిజనులంతా చెల్లాచెదురుగా పడిపోయారు. సంఘటన స్థలంలోనే గొల్లూరి హరి, అమలకాంత్, చగుబాయి సింహాద్రి తీవ్ర గాయాలతో మృతి చెందారు. ఈ ప్రమాదం జరిగిన కొద్దిసేపటికే చినలబుడు పంచాయతీకి చెందిన కిల్లో పరశురామ్, కిల్లో సతీష్‌లు మరో బైక్‌పై నందివలస శివరాత్రి జాతరకు వెళుతూ.. రోడ్డుపై పడిఉన్న బైక్‌లను ఢీ కొట్టడంతో వారు కూడా తీవ్ర గాయాలపాలయ్యారు. సమీపంలోని గిరిజనులతో పాటు రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహన చోదకులంతా ఈ ప్రమాద సంఘటను చూసి గాయాలపాలైన వారిని హుటాహుటిన అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భార్గవ అనే బాలుడు మృతి చెందగా.. కేజీహెచ్‌కు తరలిస్తున్న సమయంలో గుబాయి త్రినాథ్ ప్రాణాలు కోల్పోయాడు.



కుమారుడు, భర్త మరణాన్ని తట్టుకోలేక సొమ్మసిల్లి పడిపోయిన బురిడి జానకి



సంఘటన ప్రాంతంలో నుజ్జయిన బైక్‌లు

ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి

ఈ ప్రమాదంలో ఒకే కుటుంబంలో ముగ్గురు చనిపోవడంతో గానుగవలస గ్రామంలోని గిరిజనులంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుబాయి త్రినాథ్‌తోపాటు అతని తమ్ముడు గుబాయి సింహాద్రి అక్కడికక్కడే మృతి చెందారు. సింహాద్రి కుమారుడు భార్గవను స్థానికులు అరకులోయ ఆస్పత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ ప్రమాదంలో భర్త సింహాద్రి, కుమారుడు భార్గవలను కోల్పోవడంతో గుబాయి జానకి కన్నీరుమున్నీరుగా రోదిస్తోంది. ఆమె సొమ్మసిల్లి పడిపోగా బంధువులు సపర్యలు చేశారు. గానుగవలస గ్రామంలోని గిరిజనులంతా ఆస్పత్రికి చేరుకుని మృతదేహాలను చూసి కన్నీటిపర్యంతమయ్యారు.

చినలబుడులోను విషాదం

బురిడి హరితోపాటు గిరిజన బాలుడు గొల్లూరి అమలకాంత్‌లు ఈ ప్రమాదంలో మృతి చెందడంతో చినలబుడు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. చినలబుడు గ్రామంలోని గిరిజనులు కూడా అరకులోయ ఆస్పత్రికి చేరుకుని మృతదేహాలను చూసి విలపించారు. హరి తల్లి సోయిత ఆస్పతి వద్ద కన్నీరుమున్నీరైంది. రఘునాథ్ కుమారుడైన అమలకాంత్ జాతర చూసి వస్తానని సరదా పడి వెళ్లి ఈ ప్రమాదంలో అనంతలోకాలకు వెళ్లిపోవడం తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిల్చింది. ఐదుగురు గిరిజనుల మృతదేహాలకు వైద్యులు శవపరీక్షలు నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సంతోష్ తెలిపారు.

ఎమ్మెల్యే పాల్గుణ సంతాపం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి బాధాకరమని అరకు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెట్టి పాల్గుణ విచారం వ్యక్తం చేశారు. శనివారం ఆయన స్థానిక ఏరియా ఆస్పత్రి మార్చురీలోని మృతదేహాలను ఎస్టీ కమిషన్ సభ్యురాలు రామలక్ష్మి, పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. బాధిత కుటుంబాలను, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు కిల్లో పరశురాం, కిల్లో సతీష్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, ప్రభుత్వం నుంచి సహకారం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.



అరకు ప్రాంతీయ ఆస్పత్రిలోని మార్చురీ వద్ద మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు

జూలో మరో రెండు నల్ల హంస పిల్లలు



జూ కొలనులో తల్లి హంసతో తిరుగుతున్న పిల్లలు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూపార్కులో నల్ల హంస మరో రెండు పిల్లల్ని పొదిగింది. దీంతో జూలో వాటి సంఖ్య 12కి చేరింది. రెండు పిల్లల్ని తల్లి హంసతో పాటు జూ కొలనులో వారం రోజులు నుంచి విడిచిపెడుతున్నారు. ఆ పిల్లలు కొలనులో తల్లి వెనుక ఈతకొడుతూ హుషారుగా తిరుగుతూ సందర్శకులను కనువిందు చేస్తున్నాయి. సుమారు ఎనిమిదేళ్ల క్రితం ఇక్కడకు ఒక జత ఆస్ట్రేలియన్ నల్ల హంసలను జూ అధికారులు తీసుకొచ్చారు. అవి ఇంతవరకు నాలుగు విడతలలో పిల్లలను పొదగడంతో వాటి సంఖ్య 12కు చేరింది. గత ఏడాది ఇక్కడ ఓ నల్ల హంస నాలుగు పిల్లల్ని పొదిగిన విషయం తెలిసిందే. ఈ హంసల కొలను జూ ప్రధాన ద్వారం దాటగానే లోపల ఎదురుగా సందర్శకులకు కనిపిస్తుంది.

ఐదున్నర టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

బుచ్చెయ్యపేట : మండలం గున్నెంపూడిలో ఓ ఇంట్లో బయటకు తరలించడానికి నిల్వచేసిన ఐదున్నర టన్నుల రేషన్ బియాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. స్థానికుల సమాచారం మేరకు శనివారం విజిలెన్స్ సీఐ తిరుపతిరావు, ఎస్ఐ రవి, సీఎస్‌డీటీ ఈశ్వరరావు తమ సిబ్బందితో గున్నెంపూడిలో సోదాలు చేశారు. రేషన్ డిపోకు దగ్గరలో ఒక ఇంట్లో నిల్వ చేసి తరలించడానికి సిద్ధం చేసిన 111 బస్తాలు రేషన్ బియ్యం గుర్తించారు. గున్నెంపూడి రేషన్ డీలర్ ముమ్మిడిశెట్టి సునీత భర్త రమేష్ ఈ బియ్యాన్ని నిల్వ చేసినట్టు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. పట్టుకున్న బియ్యాన్ని రావికమతం ప్రభుత్వ రేషన్ గుడౌన్‌కు తరలించి లెక్కించగా 5,650 కేజీలుగా గుర్తించారు. గున్నెంపూడి రేషన్‌డిపోను తెరిపించి రికార్డులను, అక్కడ ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. ల్వాలు,రికార్డులు సరిపోవడంతో ఎక్కడ నుండి రేషన్ బియ్యం తీసుకొచ్చింది విజిలెన్స్ అధికారులు విచారణ చేశారు. దీంతో పలువురు వద్ద నుంచి బియ్యం కొనుగోలు చేసినట్టు రేషన్ డీలర్ భర్త రమేష్ అధికారులకు తెలిపారు. దీనిపై రమేష్‌పై ప్రభుత్వ రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినందుకు 6ఎ కేసుతో పాటు అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు 7(1) కేసు నమోదు చేసినట్టు విజిలెన్స్ అధికారులు తెలిపారు.